# గ్రామసేవయే రామసేవ!

**ఐకమత్యమె బలము అందరి శ్రేయంబు**
**ఎంతకార్యమైన నెగ్గవచ్చు**
**చిన్న చీమలు చేరి సర్పమును బట్టి**
**చంపుచుండుటలేదె జగతియందు**

**జాతి గౌరవంబు నీతిపై నిలుచును**
**నీతిలేకయున్న జాతి చెడును**
**నీతి కల్గు జాతి నిజమైన జాతిరా**
**వినుము భారతీయ వీరసుతుడ!**

దివ్యాత్మ స్వరూపులారా! గ్రామాధికారులారా!

వ్యక్తి అభివృద్ధి కావలెనన్నను, గ్రామము పురోభివృద్ధి నొందవలెనన్నను, దేశము సస్యశ్యామలముగా నుండవలెనన్నను, సంఘీభావము, ఐకమత్యము అత్యవసరము.

**సమైక్యతే మానవుని సంరక్షించును; అనైక్యతే అనేక అశాంతులకు గురి చేయును**

సమైక్యతే మానవుని సంరక్షించును. అనైక్యతే అనేక అశాంతులకు గురి చేయును. ఈ ప్రపంచమునందు ఐకమత్యమునకు మించిన బలము మరొకటి లేదని, 'సంఘేబలౌ కలియుగే' అన్నారు. సంఘబలముకంటె బలము మరొకటి లేదు. భారతదేశముయొక్క చరిత్రను మనము ఒక్కతూరి వెనుకకు తిరిగి చూచినప్పుడు తురుష్కులు, పోర్చుగీసువారు, ఫ్రెంచివారు, బ్రిటీషువారు వీరందరు భారతదేశమును ఆక్రమించి భారతదేశముయొక్క సౌభాగ్యమైన సంస్కృతిని లెక్క చేయక అనేక విధములుగా భారతీయ సంస్కృతిని మార్పు చేయటానికి ప్రయత్నించారు. దీనికి కారణమేమి? భారతదేశములో గుణవంతులు,

srisathyasaivachanamrutam

బలవంతులు, విద్యావంతులు లేకపోలేదు. రాజకీయ నాయకులుగానీ, దేశాభిమానులుగానీ, వైజ్ఞానికులుగానీ లేకపోలేదు. కానీ వారలమధ్య ఐకమత్యము లేకపోవటంచేతనే భారతదేశము యిన్ని అవస్థలకు గురికావలసి వచ్చింది. ఐకమత్యమే ప్రధానమైన సూత్రము. భారతీయులందు ఐకమత్యము అత్యవసరము. భారతీయులు స్వాతంత్ర్యమును సాధించిరిగానీ, ఐకమత్యమును సాధించలేకపోతున్నారు. కారణము, విశాలమైన భావము క్రమక్రమేణా దిగజారిపోతున్నాది. ప్రాంతీయ దురభిమానములు, కులమత వైషమ్యములు, స్వార్థ స్వప్రయోజనములు విజృంభించి జాతియొక్క బలమును దినదినమునకు దిగజారిపోవునట్లు చేయుచున్నవి. యింతేకాక, భారతదేశములోని ప్రజలందరుకూడను తాము ఒకే జాతికి, ఒకే సంస్కృతికి సంబంధించినవారమనే విశాలభావము లేకపోవటంకూడను ఈ దురవస్థలకు ఒక కారణముగా యేర్పడింది.

**దేశ సమగ్రతను, సమైక్యతను ప్రజలందరు కలసి పోషించుకోవాలి**

ప్రేమస్వరూపులారా! ధర్మజుడు ఒక మాట చెప్పాడు: 'ఇతరులు మాపైన దండెత్తి వచ్చినప్పుడు మేము 105 మంది సోదరులము. కానీ, మాలో మాకు భేదము కలిగినపుడు పాండవులు ఐదుమంది, కౌరవులు నూరుమంది. యీ విశాలభావాన్ని మనము ఒకతూరి విచారణ చేసినప్పుడు దేశసంబంధమైన సమస్యలు యేర్పడినప్పుడు మనమందరము సోదరులము. అందరూ ఐకమత్యముగా పని చేయాలి. వ్యక్తిగతమైన ద్వేషము వచ్చినప్పుడు వ్యక్తికి, వ్యక్తికి మధ్య సంబంధించినటువంటిది. కనుక, దేశసౌభాగ్యమునకుగానీ, దేశఐక్యతకుగానీ, దేశక్షేమమునకుగానీ, భారతీయులందరు ఒక్క రీతిగా అన్నదమ్ములవలె కలసిమెలసి పోరాడవలసిన సమయము యేర్పడినది. దేశమునకుగానీ, సమాజమునకుగానీ సమత, సమైక్యత, సమగ్రత, సౌభ్రాతృత్వము యీ నాలుగు స్తంభములవంటివి. యీ నాలుగు స్తంభములపైననే భరతజాతి సౌధము భద్రతతో నిల్చివుంది. ఇందులో ఏ ఒక్కటి క్షీణించినప్పటికి భవనము కుప్పగా కూలిపోతుంది. కనుక, దేశ సమగ్రతను, సమైక్యతను ప్రజలు సరైన రీతిలో పోషించుకోవాలి. మానవత్వములో వుండిన దివ్యత్వానికి, పవిత్రతకు మానవులే ఆధారము. మానవుడనగా ఏమిటి?

srisathyasaivachanamrutam

దేశమంటే ఏమిటి? దేశమంటే దేహమే అనుకుంటున్నారు. దేశమునకు, దేహమునకు బింబప్రతిబింబ సంబంధము వుంటున్నది. మానవుడనగా ఎవరు? మానవుడనగా మనస్సే! మనస్సనగా ఏమిటి? సంకల్పములయొక్క చేరికయే! సంకల్పములయొక్క ప్రభావమే మన నిత్య జీవితములో అనుభవించే సుఖదుఃఖములు. మన ఆచరణయందు పవిత్రమైన భావాన్ని వుంచుకున్నప్పుడే మానవత్వము సార్థకమవుతుంది.

**గ్రామనాయకుండె గ్రామసేవకుడైన**
**స్వార్థరహిత సేవ చేయగలడు**
**పదవికాంక్షవాడు పరిశుద్ధ హృదయుడా?**

కాదు. కనుక, గ్రామనాయకుడు గ్రామసేవకుడు కావాలి. ఈ గ్రామనాయకులైన వారందరు ప్రజలకు, ప్రభుత్వమునకుమధ్య సేతువువంటివారు. ఈ సేతువు భద్రముగా వుండినప్పుడే ప్రజలకు, ప్రభుత్వమునకు సన్నిహిత సంబంధ బాంధవ్యమును చక్కగా ఏర్పరుస్తారు, గ్రామాధికారులు. గ్రామమనగా పల్లెలు అనుకుంటున్నారు. కాదు కాదు. 'గ్రామమే దేశము, దేశమే గ్రామము.' గ్రామములేక దేశములేదు. అధికారులనగా అధిక+అరి=అధికారి అని. అరి అనగా ఏమిటి? ఎవ్వరిపైనా ద్వేషం లేకుండా వుండేవాడే 'అధికారి' అని. సర్వులనూ సమత్వంగా చూసుకునేవాడే అధికారి. ఇలాంటి పవిత్రమైన పదమునకు అర్థాన్ని గుర్తించి, వర్తించినప్పుడే మానవత్వం సార్థకమవుతుంది.

**రూప, నామములు వేరైనప్పటికి మానవులందరు సచ్చిదానంద సాగరమునుండి ఉద్భవించినవారే!**

విశాలమైన సముద్రమునందు అసంఖ్యాకమైన అలలు ఆవిర్భవిస్తుంటాయి. కాని, ఒక్క అల వుండినట్లు మరొక అల వుండదు. అన్నీ భేదంగా కన్పిస్తుంటాయి. అలలు భిన్నభిన్నంగా కన్పించినంతమాత్రాన అలలు వేరు కాదు, సముద్రం వేరుకాదు. ఈ అలలన్నీకూడా సముద్రంనుండి ఆవిర్భవించినటువంటివే! సముద్రంయొక్క రుచి, రూపములంతాకూడా యీ అలలలో వుంటుంటాయి. అదేవిధంగా మానవులు భిన్న భిన్న రూపనామములతో కన్పించినప్పటికినీ అందరుకూడా సచ్చిదానంద సాగరమునుండి

sri sathyasai vachanamrutam

ఉద్భవించిన వ్యక్తులనే సత్యం మనం గుర్తించాలి. ఈ పవిత్రమైన భావాన్ని మనం విస్మరించి, కేవలం దేహమే ప్రధానమని, లౌకికమే ఆధారమని విశ్వసించి, అనిత్యము, అశాశ్వతము అయిన జీవితంలో అనేక అవస్థలకు గురి అవుతున్నాము. నిర్విరామకృషితో, నిరంతర తాపత్రయములతో, అంతులేని ఆశలతో, అర్థంకాని ఆవేదనలతో, అప్రాప్తరూపమైనదానికై ప్రాకులాడి అశాంతికి గురి అయ్యే మానవులకు దిక్కులు చూపే చక్కని దీపికలు ఆధ్యాత్మిక జ్యోతులనే సత్యాన్ని మనం యీనాడు గుర్తించాలి. అప్పుడే మానవత్వం సార్థకమవుతుంది.

**అనేకత్వములోని ఏకత్వమును నిరూపించేదే ఆధ్యాత్మికతత్త్వము**

ఆధ్యాత్మికము అత్యవసరమైనటువంటిది. మానవునియందు నిరంతరం వికసించి, ప్రకాశించి అనేక మార్గములను దర్శింపజేసేది ఆధ్యాత్మికము. ఆధ్యాత్మికమనగా కేవలము ఒంటరితనమని, ఏకాకి జీవితమని కాదు. యావత్ మానవకోటిని ఏకంగా భావించి, అనేకత్వములోని ఏకత్వాన్ని నిరూపించేదే ఆధ్యాత్మికతత్త్వము. అదే భారతీయ సంస్కృతి. ఇలాంటి సంస్కృతి, అనాది కాలమునుండి పల్లెలలో ప్రారంభమయి పట్టణములవరకు చేరిపోయింది. అయితే, యీనాడు సంస్కృతి పట్టణంలో ప్రారంభమయి పల్లెలవరకు అంత్యమవుతూ వస్తోంది. ఇదే నాటికీ, నేటికీ ఉన్న భేదము. ఈనాటి చదువులవల్లకాని, యీనాటి జీవితములవల్లకాని, ఈనాటి ఆధునికమైన పరికరములవల్లకాని మన జీవితములు అభివృద్ధి గావించుకొనలేము. అనాది కాలమునుండి వస్తున్న ప్రాచీన సంస్కృతిని మనమీనాడు కొంతవరకు హృదయంలో చింతించాలి.

**వ్యక్తి భేదములు విస్మరించి విశాలహృదయమును పెంపొందించుకున్నప్పుడే గ్రామాభివృద్ధి సాధ్యపడుతుంది**

గ్రామముయొక్క క్షేమమే దేశక్షేమము. గ్రామములో వున్న ప్రజలకంతా తగిన అనుకూలములు కల్పించి వాళ్ళలో అన్యోన్యతను నెలకొల్పి అన్నదమ్ములవలె కలసిమెలసి వుండినప్పుడే గ్రామాభివృద్ధికి ఎంతైనా అవకాశం వుంది. వ్యక్తిగతంగా భేదములుండవచ్చు. కాని, వాటిని మనం విస్మరించి గ్రామాభివృద్ధికి కావలసిన విశాల హృదయాన్ని అభివృద్ధి

sri sathyasai vahini amrutam

గావించుకోవాలి. ఆకాశమునుండి కురిసే సమయంలో వర్షము ఒక్కటిగానే వుంటుంది. కాని, అ చినుకులు పడిన ప్రదేశ ప్రభావమును పురస్కరించుకొని రూపనామములు మారుతుంటాయి. అంతమాత్రంచేత వర్షములో భేదములేదు. ప్రదేశముయొక్క ప్రభావమును పురస్కరించుకొనియే భేదములు కన్పించుచున్నవి. కనుక, వ్యక్తుల హృదయాన్ని విశాలం గావించుకున్నప్పుడే దానియొక్క పవిత్రమైన చరిత్రను మనం చాటడానికి అర్హులమవుతాము.

**దేశసౌభాగ్యమే మన సౌభాగ్యముగా భావించాలి**

ప్రేమస్వరూపులారా! గ్రామాధికారులందరూకూడా ఆదర్శవంతమైన జీవులుగా రూపొందినప్పుడే దేశము సుక్షేమంగా వుంటుంది. నిత్య కళ్యాణం పచ్చ తోరణంగా దేశము విలసిల్లుతుంది. గడచిపోయినదేదో గడచిపోయినది. రాబోయేటటువంటిది యీనాటి వర్తమానంపై ఆధారపడివుంటుంది. వర్తమానంలో మనం ఏవిధమైన క్రియలు సల్పుతామో దానియొక్క ఫలితమే భవిష్యత్తుగా మారుతుంది. కనుక, భవిష్యత్తు బాగుపడాలంటే వర్తమానంలో మనము సరియైన, సత్క్రమమైన, దివ్యమైన, నవ్యమైనటువంటి రీతిలో ఆదర్శాన్ని నిరూపించాలి. ఈనాడు గ్రామాధికారులంతా ఒక్కచోట చేరి యీ పవిత్రమైన దానికి తగిన ట్రైనింగ్ తీసుకోవాలనే ప్రయత్నము ఆదర్శవంతమైనది. ఏదో మనకు వ్యక్తిగతంగా అనేక విధములైన కష్టములు, నష్టములు, దుఃఖములు వుండవచ్చు. కానీ వీనినంతా ప్రక్కకు నెట్టి దేశక్షేమంకోసం మనం కృషి చేయాలి. 'దేశసౌభాగ్యమే మన సౌభాగ్యం, దేశముయొక్క క్షేమమే మన క్షేమము,' అనే దివ్యమైన భావాన్ని మనం అభివృద్ధిపరచుకుంటే యింతకంటే మానవత్వానికి మించినది మరొకటి లేదు.

మానవుడు-మానవుడనగా ఏమిటి? మనస్తత్వం కలవాడు మానవుడు. ఎలాంటి తత్త్వం వుండాలి? మా-అజ్ఞానము, న-లేకుండా, వ-వర్తించడం. అజ్ఞానం లేకుండా వర్తించడం అంటే ఏమిటి? జ్ఞానమే! జ్ఞానమనగా ఏమిటి? విశాలత్వమే! విశాలత్వమనగా ఏమిటి? ప్రకాశమే! కనుక విశాలత్వముతో, ప్రకాశముతో మానవత్వాన్ని మనం కొనసాగించుకున్నప్పుడు మన దేశమును దివ్యమైన దేశంగా తీర్చిదిద్దవచ్చు. దేశముయొక్క

srisathyasaivachanamrutam

సౌభాగ్యమంతాకూడను వ్యక్తిపైన ఆధారపడివుంది. వ్యక్తియొక్క సౌభాగ్యం కుటుంబముపై ఆధారపడివుంటుంది. కుటుంబంయొక్క సౌభాగ్యం గ్రామంపైన ఆధారపడివుంటుంది. గ్రామంయొక్క సౌభాగ్యం అంతా జిల్లాపైన ఆధారపడివుంటుంది. జిల్లాయొక్క సౌభాగ్యం రాష్ట్రముపైన అధారపడివుంటుంది. కనుక, రాష్ట్రముయొక్క అభివృద్ధి అంతా వ్యక్తిపైన అధారపడివుంటుంది. వ్యక్తియే లేకపోయిన గ్రామమే లేదు. గ్రామమే లేకపోయిన జిల్లానే లేదు.

ఒక్క వ్యక్తి సమాజం కాదు. ఒక్క చెట్టు వనము కాదు. ఒక్క యిల్లు గ్రామంకాదు. అనేక యిండ్లు చేరినపుడే గ్రామము. అనేక మొక్కలు చేరినపుడే వనము. అనేక వ్యక్తులు చేరినపుడే సమాజము. అందరూకూడా ఏకంగా వుండినపుడే యిది ఒక సమాజంగా రూపొందుతుంది. మానవులు ఐకమత్యంచేత దేనినైనా సాధించవచ్చు. ఐకమత్యంచేత సాధించలేనిది జగత్తులో ఏ ఒక్కటికూడా లేదు. ఎంతటి కార్యాన్ని అయినా మనం సాధించవచ్చు. కనుక, ప్రతీ వ్యక్తికూడా ఐకమత్యాన్ని అభివృద్ధి పరచడానికి కృషిచేయాలి.

**వ్యక్తి క్షేమము గ్రామముయొక్క క్షేమముపై ఆధారపడియున్నది**

యీనాడు జిల్లా అధికారులు, మినిష్టర్లు అందరూ వచ్చి ఎంతో వైభవంగా, ఎంతో విశాల హృదయంతో దేశానికి ఆదర్శాన్ని అందించాలి అనే ఉద్దేశంతో యింతటి పెద్ద కార్యానికి పూనుకున్నారు. దానికి తగిన చేదోడు వాదోడుగా మీరందరూ ఏకమై ఆదర్శవంతమైన గ్రామాలుగా, ఆదర్శవంతమైన జిల్లాలుగా నిరూపించాలని నేను ఆశిస్తున్నాను. ముఖ్యంగా గ్రామాలలో చాలా కక్షలు, కలహాలు, కల్లోలాలు ప్రారంభమవుతుంటాయి. కానీ, యిలాంటిదానికి యేమాత్రం అవకాశము యివ్వకుండ గ్రామాధికారులు చూచుకోవాలి. గ్రామము బాగున్నపుడే నీవుకూడా బాగుంటావు. నీ క్షేమము గ్రామముయొక్క క్షేమముపైన ఆధారపడివుంటున్నది. కనుక, గ్రామములోపల యేవిధమైన కల్లోలములకు, కలతలకు అవకాశము లేకుండా చూచుకోవాలి. ఒక్క గ్రామము వుంటే ఆ గ్రామంలో నాల్గు పార్టీలు. ఇది సరియైనది కాదు.

**ఇది నాదు మాతృదేశము**

sri sathyasai vachanamrutam

**ఇది నా ప్రియ మాతృభాష ఇది నా మతమం**
**చెదగొట్టి నుదువనేరక**
**బ్రదికిన జీవి యొకడైన వసుధను గలడా!**

మన గ్రామము అనుకున్నప్పుడు, మన గ్రామంలో అందరం కలసి ఒకటిగా వుండాలి. ఆవిధమైన ఐకమత్యమునకు మీరెంతైనా శ్రమ పడాలి. అయితే మినిష్టర్ గారు చెప్పారు. మీకిచ్చే జీతాలు తక్కువయినప్పటికి, జీవితంపై ఆధారం పెట్టుకుని మీరు జీతాన్ని ఆశించాలి.

జీవితం బాగుండినపుడే జీతంకూడా విలువైనది అవుతుంది. జీవితాన్ని మనం మంచిగా ఆదర్శంగా నిరూపించినపుడే జీతం ఆటోమేటిక్‌గా పెరిగిపోతుంది. ఆయొక్క జీవితాన్ని మీరు చక్కగా ఆనందంగా అనుభవించగలరు. కనుక, జీతముపైన లెక్కపెట్టకుండా మన గ్రామాభివృద్ధిని కాంక్షించి పని చేయాలి. దీనికి తగిన అనుకూలాలు సమకూర్చడానికి అధికారులు చక్కగా సరియైన భావముతో వాళ్ళను సంప్రదించి నిర్ణయాలు తీసుకోవచ్చును. కాని, స్ట్రైకులు, బంద్‌లు అని యిలాంటివంతా పిచ్చిపిచ్చివి మనం ప్రారంభించకూడదు. ఇందువల్ల ఏమైపోతుందంటే నీ వ్యక్తిగతమైన స్వార్థంకోసం గ్రామానికంతా అననుకూలములు కల్గిస్తున్నావు. ప్రజలకంతా అననుకూలం కల్గిస్తున్నావు. ఈ బంద్‌లు అనేవి, స్ట్రైకులు అనేవి అర్థంలేని పనులుగా వుంటున్నాయి. ఇవన్నీ ఎంతమంది ప్రజలకు ఎన్ని అననుకూలములు కలిగిస్తున్నాయి! వీటివల్ల సమాజానికి నష్టమే కాకుండా సంస్థకుకూడా చెడ్డపేరు తెస్తోంది. ఇదేదో గొప్పది అనుకుంటున్నామే కాని రాజకీయంలో యివి చాలా విరుద్ధమైన మార్గాలుగా రూపొందుతున్నాయి. ఇలాంటివి జరగకూడదు. గ్రామాధికారులు చక్కగా ధైర్యంతో, సాహసంతో, నిస్వార్థభావంతో కృషిచేస్తే ఎంతైనా మనం సాధించడానికి అవకాశం వుంటుంది.

**మన శక్తి, సామర్థ్యములు, ఇంద్రియములు అన్నీ సత్క్రమమార్గంలో ప్రవేశ పెట్టాలి**

ప్రేమస్వరూపులారా! మీరు ధైర్యసాహసములతో, ఉత్సాహముతో యీ విధమైన అల్లకల్లోలములకు అవకాశం కల్పించకుండా గ్రామం సుక్షేమంగా వుంది, ప్రశాంతంగా వుంది అనే పేరును సాధించండి. అదే నిజంగా మీరు సాధించవలసినది.

పూర్వకాలమునుండీ 'గ్రామపెద్ద' అంటే ఎంతో గొప్పవాడు. గ్రామసింహమని పిలిపించుకునేవాడు, సింహంగా వుండాలి. అనగా ఏమిటి? అందరిపైనా కక్షలు తీర్చుకోవటంకాదు. అందరినీ చంపటంకాదు. సింహంయొక్క లక్షణం అందరినీ కాపాడుకోవటమే! అదే మృగరాజుయొక్క కర్తవ్యం. గ్రామములో వున్న ప్రజలకంతా ఒక రాజుగా వుండాలి. మన దివాకరరెడ్డి చెప్పాడు. జిల్లాకంతా కలెక్టరు అధికారిగా వుంటున్నాడు. రాష్ట్రానికంతా మినిష్టరు అధికారిగా వుంటున్నాడు. కాని గ్రామాధికారి గ్రామానికంతా అధికారి. అతడూ ఒక కలెక్టరే! నిజమే! ఆ గ్రామానికి ఒక కలెక్టరు. ఇతను తగిన విత్తమంతా వసూలు చేసుకోవటం, సక్రమమైన మార్గంలో వినియోగించుకోవటం, సక్రమంగా దానిని వసూలు చేసుకోవటం వీటిలో ఒక ఆదర్శమును నిరూపించాలి. మన శక్తి సామర్థ్యములు, మన యింద్రియములు అన్నీకూడా సద్వినియోగపరచుకునే మార్గంలో మనం ప్రవేశపెట్టాలి. ప్రతీ యింద్రియం వుంటోంది. కాని, ఇంద్రియంయొక్క అనుభూతిని సరియైన మార్గంలో పెట్టుకోవాలి. దానిని దుర్మార్గంలో మనం ప్రవేశపెడితే దుష్టత్వానికి గురి అయిపోతాము.

**ఈనాడు అందరూ హక్కులకోసం పోరాడుతున్నారేగాని, కర్తవ్యాన్ని గుర్తించటానికి ప్రయత్నించటం లేదు**

ప్రేమస్వరూపులారా! గ్రామాధికారుల అదృష్టము, గొప్ప అదృష్టము. ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో గ్రామానికి మనం అధికారులమయినాము. కనుక, అధికారులమయినపుడు మన గ్రామాన్ని ఏనాడు మనం చక్కగా తీర్చిదిద్దుతామో అప్పుడే మన అధికారానికి తగిన సార్థకత ఏర్పడుతుంది. కేవలం అధికారం మాత్రం చేపట్టి దానికి తగిన కర్తవ్యాన్ని నిర్వర్తించకుండా పోయినపుడు దేశానికి, గ్రామానికి ద్రోహం చేసినవారమైపోతాము. ఈనాడు మానవునకు రెండు వుంటున్నాయి. ఒకటి కర్తవ్యము, రెండవది హక్కు. కాని, ఈనాటి మానవులందరు హక్కుకోసం పాటుపడుతున్నారేకాని, కర్తవ్యాన్ని గుర్తించటానికి ఏమాత్రం ప్రయత్నించటంలేదు. ఈ కర్తవ్యము, హక్కు రెండూ రెండు చక్రాలవంటివి. రెండూ కూడను రెండు రెక్కలవంటివి. ఈ రెండు రెక్కలే లేకపోతే

srisathyasaivahini.org

మనమేమాత్రం పైకి ఎగురలేము. రెండు చక్రములే లేకపోతే మనం ఏమాత్రం ప్రయాణం చేయలేము. కనుక, మనం కర్తవ్యాన్ని చక్కగా నిర్వర్తించినపుడే, హక్కు సహజంగా మనకు ప్రాప్తిస్తుంది.

యీనాడు కొంతమంది హక్కుకోసం పోరాటం చేస్తున్నారేకాని, కర్తవ్యమేమిటి? అని ఆలోచించటం లేదు. నా కర్తవ్యాన్ని నేను నిర్వర్తిస్తున్నానా? అని ఎవరికి వారు ప్రశ్నించుకుంటే, యీ హక్కుకు ఏమాత్రం అర్థుడు గాకుండా పోతున్నాడు. యీనాడు గ్రామాధికారులందరూ ప్రమాణస్వీకారం చేసినపుడు గ్రామానికి తగినటువంటి సుక్షేమాన్ని, భద్రతను, ఐకమత్యమును, అనుకూలములను కల్గిస్తామని ప్రమాణం చేయాలి! వాటికొరకు సాధ్యమైనంతవరకు పాటుపడాలి. గ్రామం మంచిగా వున్నప్పుడే నీ కుటుంబంకూడా మంచిగా వుంటుంది. కనుక, గ్రామంయొక్క క్షేమమును మీరు ప్రధానంగా చూసుకొని విద్యకాని, వైద్యంకాని యింకే విధమైన చిన్న చిన్న పనులలోపల ఐకమత్యంగా వున్నప్పుడు ఎంతైనా మనం సాధించవచ్చు. ఐకమత్యమనేది లేకపోతే మనం ఏమాత్రం సాధించలేము.

**మంచి పదవులు కోరుకున్నప్పుడు మంచి ప్రవర్తనకూడా ఉండాలి**

"మంచికాలము, పదవులు, మంచి బ్రతుకు కోరుచుందురు, మనుజులు. కాని, మంచి బుద్ధులు, జ్ఞానం, మంచి నడత కోరబోరు". మంచి కాలము కోరినపుడు మంచి బుద్ధులుకూడా కోరాలి కదా! పదవులు కోరినపుడు మంచి ప్రవర్తనకూడా వుండాలి కదా! ఒకదానికొకటి విరుద్ధంగా మనం ప్రవర్తించకూడదు. ఆవిధంగా వుండినపుడే మన జీవితంకూడను ఆదర్శవంతమైన జీవితంగా వుంటుంది. ప్రాచీన కాలమునుండి ఏ మినిష్టరులు, ఏ గవర్నరులు లేకపోయినా, గ్రామాధికారే గ్రామానికంతా అధిపతి. అతను ఎంతో బాగా పని చేసి గ్రామాన్ని అంతా తీర్చిదిద్దేవాడు. ఆనాడే ఐకమత్యంగా వుండేవారు. ప్రజలంతా ఒక్క మాటపైన, ఒక్క బాటపైన నిలిచేవారు. ఈనాడు యింట్లో నల్గురున్నారంటే, నల్గురికి నాల్గు మాటలు, నల్గురికీ నాలుగు బాటలు. ఐకమత్యం ఎలా ఏర్పడుతుంది? చేతిలో వున్న ఐదువేళ్లుకూడా ఏకంగా చేరినపుడే ఏ పనైనా మనం సుఖంగా చేయవచ్చును. ఐదువేళ్ళు ఐదు వైపులా పోయాయంటే ఏ పనీ మనం చేయలేము. ఈ

srisathyasaivachanamrutam

చెయ్యికూడా నిరుపయోగమైపోతుంది. మనలో ఐదు విధములైన గుణములు ఉంటున్నాయి. సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ, అహింస యివే మన గుణములు. నిజంగా మనం ఆచరించవలసినది, నీతి నిజాయితీలతో కూడిన మానవత్వానికి తగిన రీతిగా నడుచుకోవడం. మానవత్వమనగా కేవలం ఎక్కడినుండో వచ్చినటువంటిది కాదు. మనలోనే సహజంగా వుంటున్నది.

**పాపభీతి, దైవప్రీతి, సంఘనీతి-యీ మూడే మానవత్వ లక్షణాలు**

**పాపభీతి లేని పామరత్వముబట్టి**
**దైవప్రీతి లేని దారిపట్టి**
**మానవత్వమణగె మానవులందున**
**విశ్వశాంతికిదియె విప్లవంబు.**

పాపభీతి, దైవప్రీతి, సంఘనీతి యీ మూడే మానవత్వము. మొట్టమొదటిది పాపాలకి భీతి చెందటం; 'యీ పాపాలు నేను చేయకూడదు, అని వెనుకంజ వేయాలి. రెండవది దైవప్రీతిలో ముందంజ రావాలి. మూడవది సంఘములో, సమాజంలో మనం నీతిని నిలబెట్టుకోవాలి. పాపభీతి, దైవప్రీతి, సంఘనీతి ఆ మూడు వుంటే యింతకంటే మానవుని విశాలత, యింతకంటే మానవుని అభివృద్ధి మరొకటి లేదు. అదే నిజమైన మానవత్వము. మానవుడని పేరు పెట్టుకొని మానవత్వం లేకుండాపోతే ఎలా? అగ్నిలోపల వేడి వున్నది. వేడికి కాల్చే గుణము వుంటుంది. ఈ వేడి లేకుండా, కాల్చే శక్తి లేకుండాపోతే, అది అగ్ని ఎలా అవుతుంది? బొగ్గు అవుతుంది. చక్కెర అనగా తీపి అని దాని గుణము వుంటున్నది. తీపే లేకపోతే అది చక్కెర కాదు. తెల్లటి యిసుక అవుతుంది. అదే రీతిగా మానవుడనేవాడికి యీ మూడు గుణములు వుండినపుడే వాడు మానవుడు అవుతాడు కాని లేకపోతే మానవుడే కాదు. అటువంటివాడు ఆకార మానవుడే కాని, ఆచార మానవుడు కాదు. కనుక ఆకార మానవునితోపాటు, ఆచార మానవత్వాన్నికూడా మనం తీర్చిదిద్దుకోవాలి. ఇదే నిజమైన

sri sathyasaivachanamrutam

మానవత్వము. ఈనాడు మానవత్వమెక్కడా కంటికి కనపడటంలేదు.

ప్రేమస్వరూపులారా! మీరందరూ "నేను మానవుడిని, నేను మానవుడిని; పశువును కాదు, పశువును కాదు", అని అనుకోవాలి. నేను మానవుడు అని అనుకోవటం అర్థసత్యము మాత్రమే. మరొక అర్ధసత్యమేమిటి? నేను పశువును కాదు. ఈ రెండు చేరినపుడే పూర్తి సత్యమవుతుంది. నేను మానవుడు, పశువు కాదు. ఆవిధంగా వున్నప్పుడు యింతకంటే యింక మానవత్వం లేదు. అటువంటి వ్యక్తి దేదీప్యమానంగా, ఆదర్శవంతమైనవానిగా వుండి, దేశానికి కూడా ఒక ఆదర్శంగా వుంటాడు. కనుక దయ, ప్రేమ, సహనం, సానుభూతి యిలాంటి పవిత్రమైన గుణాలతో ఒకరితో ఒకరు అన్యోన్యంగా కలసిమెలసి వుండినపుడు ఎంతైనా మనం దేశానికి సేవ చేయవచ్చు. మనందరం యీనాడు యీ ప్రదేశంలో చేరటంచేత, మున్ముందు యీ అనంతపురం జిల్లాకే యీ గ్రామాధికారులయొక్క ఆదర్శాన్ని గొప్పగా చూపించి, యావద్భారతదేశమునందు అనంతపురం జిల్లా ఆదర్శవంతమైన జిల్లా అనే కీర్తిని నిలబెట్టుకుని, ఆ కీర్తితోపాటు తగిన జీవితాన్నికూడా ఆదర్శంగా నిరూపిస్తారని నేను ఆశిస్తున్నాను.

**గ్రామసేవ లేక రామసేవ చేసి ప్రయోజనం ఏమిటి?**

భారతదేశ పవిత్రకీర్తిని జగత్వ్యాప్తి గావించిన గంగానది ఏవిధంగా సర్వత్రా పవిత్రమైనదిగా వుంటుందో అదేవిధంగా గ్రామాధికారియైనవాడు ఏ పనులయందైనను, ఏయొక్క వాక్యమునందైనా పవిత్రమైనవానిగా నిరూపించాలని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని ముగిస్తున్నాను. గ్రామసేవయే రామసేవ బంగారూ! చూడండి. గ్రామసేవ లేకపోతే రామసేవ చేసి ప్రయోజనం ఏమిటి? చాలామంది రామమందిరం కావాలంటున్నారు. మన హృదయ మందిరంలోనే రాముని ప్రతిష్ఠించుకోలేకపోతే యింక రామ మందిరంలో ఎలా ప్రతిష్ఠ చేయగలరు? కనుక హృదయ మందిరాలను భద్రం చేసుకోండి. ఆ హృదయంలో గ్రామమే రామ మందిరం అని, గ్రామసేవయే రామసేవ అని భావించుకోండి.

ఈ విధంగా అన్నింటికికూడా భుక్తికి, ముక్తికి, రక్తికి, విరక్తికి, అనురక్తికి అన్నింటికీ అదే

sri sathyasai vahini

శక్తిగా మారిపోతుంది. మీరందరూ ముక్తికోసం ప్రత్యేకంగా పాటు పడనక్కరలేదు. గ్రామసేవలో చేరండి. అదే మనకు ముక్తి అనే సత్యాన్ని గుర్తించి, మీ హృదయాలలో ప్రతిష్ఠింపచేసుకుని నిత్య జీవితంలో ప్రతిదినము హెచ్చరించుకుంటూ పోండి! అదే నాకానందము. మీకుకూడా సుఖము, సంతోషము, సౌభాగ్యము లభించాలని నేనాశిస్తున్నాను.

**(తేదీ 16-02-1992న ఇన్స్టిట్యూట్ ఆడిటోరియంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam